సాక్షి నల్లగొండ

శనివారం । 4 । మే । 2024



ముగిసిన టెన్నిస్ పోటీలు

భువనగిరి పట్టణంలో కొనసాగుతున్న జాతీయస్థాయి డబుల్స్ విభాగం టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. - IIలో



మొదటి రోజు 289 ఓట్లు

భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో శుక్రవారం హోం ఓటింగ్ ప్రారంభమైంది. తొలి రోజు 289 మంది ఓటేశారు. - IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
44° / 28°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళా రక్షణ కోసమే షీటీమ్ బృందాలు

- ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: మహిళా రక్షణ కోసం షీటీమ్ బృందాలు నిరంతరం పనిచేస్తాయని జిల్లా ఎస్పీ చందనా దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏప్రిల్ నెలలో జిల్లా వ్యాప్తంగా 13 ఫిర్యాదులు రాగా వాటిని విచారించి ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు రద్దీ ఉండే బస్టాండ్‌లు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు తదితర ప్రాంతాల్లో మహిళలను వేధింపులకు గురి చేసే వారిపై రహస్యంగా నిఘా ఉంచినట్లు తెలిపారు. మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్‌లో షీటీమ్ పోలీసులకు, డయల్ 100, వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతిలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి యువతులకు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తే షీటీమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు నల్లగొండ షీటీమ్ నంబర్ 8712670235, ఎస్పీ 8712670200, షీటీమ్ సీఐ కరుణాకర్ 8712670143, మిర్యాలగూడ షీటీమ్ ఎస్ఐ కోటేష్ 8096004465 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఆడిట్ అభ్యంతరాలపై ఆధారాలు సమర్పించాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రావు

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలంలో 2018–19 నుంచి 2023–24 వరకు నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో తెలిపిన ఆడిట్ అభ్యంతరాలపై మూడు, నాలుగు రోజుల్లో తగిన ఆధారాలు సమర్పించాలని జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత సమయంలోగా ఆధారాలు సమర్పించకుంటే ఫైనాన్షియల్ ఇన్వాల్వ్‌మెంట్ ఉన్న చోట రికవరీ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ గౌతమి, టీఏ వింధ్యారాణి, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ పద్మ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజలి పర్వం చేపట్టారు. అదే విధంగా ప్రధానాలయంలో అర్చనలు, అభిషేకం, సుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు నిర్వహించారు.

ఎనిమిది చోట్ల 46 డిగ్రీలపైనే..

- అత్యధికంగా కామారెడ్డిగూడెంలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత



నల్లగొండ టౌన్: ఎండలు మండుతున్నాయి. జిల్లాలో నాలుగు రోజులుగా అత్యధికంగా 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7గంటల నుంచే ఎండ దంచికొడుతోంది. ఉదయం 9గంటల దాటిందంటే ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావడం లేదు. 11 గంటల దాటితే వీధులు, రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తుండడంతో ఉక్కపోతతో తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం అత్యధికంగా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో 46.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనుముల హాలియా మండలం ఇబ్రహీంపేట, కట్టంగూర్ మండల కేంద్రంలో 46.5 డిగ్రీలు నమోదుకావడం విశేషం. 21 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 24 ప్రాంతాల్లో 44 డిగ్రీలకు మించి నమోదైంది. ఇంకా ఐదు చోట్ల 43 డిగ్రీలు నమోదు కాగా జిల్లాలో మిగతా చోట్ల 42 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండో వారంలో ఎండలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
త్రిపురారం	కామారెడ్డిగూడెం	46.6
హాలియా	ఇబ్రహీంపేట	46.5
కట్టంగూర్	కట్టంగూర్	46.5
దామరచర్ల	తిమ్మాపూర్	46.3
చందంపేట	తెల్దేవర్‌పల్లి	46.3
నిడమనూరు	నిడమనూరు	46.2
తిరుమలగిరిసాగర్	తిరుమలగిరిసాగర్	46.2
మాడ్గులపల్లి	మాడ్గులపల్లి	46.0

ఎమ్మెల్సీ పోరు షురూ..

- నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల దాఖలు
- భారీ ర్యాలీతో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న
- బీఆర్ఎస్ అభ్యర్థిగా వరంగల్‌కు చెందిన రాకేష్‌రెడ్డిని ప్రకటించిన కేసీఆర్
- బీజేపీలో భారీగా ఆశావహులు.. రెండు రోజుల్లో ఖరారు చేయనున్న అధిష్టానం



నామినేషన్ వేస్తున్న తీన్మార్ మల్లన్న, పక్కన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఒక వైపు పార్లమెంట్ ఎన్నికల హోరు కొనసాగుతుండగా.. ఇప్పుడు నల్లగొండ – వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక హడావుడి కూడా మొదలైంది. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ జరగనుంది. 2వ తేదీ నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న)ను ప్రకటించగా, బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా వరంగల్‌కు చెందిన ఏనుగు రాకేష్‌రెడ్డిని ప్రకటించింది. బీజేపీ మాత్రం అభ్యర్థిని ఖరారు చేయడంలో తర్జనభర్జన పడుతోంది. 9వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంది. రెండు మూడు రోజుల్లో బీజేపీ కూడా అభ్యర్థిని ప్రకటించనుంది. ఇప్పటికే రెండు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో వారు ప్రచార రంగంలోకి దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇంకా ఖరారు చేయని బీజేపీ

బీజేపీ ఇప్పటి వరకు అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఆ పార్టీలో ఆశావహులు ఎక్కువ మందే ఉన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి పోటీపడుతున్నారు. వారిలో పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందో రెండు మూడు రోజుల్లో తేలనుంది.

నామినేషన్ దాఖలు చేసిన తీన్మార్ మల్లన్న

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 2వ తేదీన నోటిఫికేషన్‌ను జారీచేసింది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తోంది. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, కుందూరు జైవీర్‌రెడ్డిలతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ దాఖలు చేశారు. అంతేకాదు మూడు ఉమ్మడి జిల్లాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో నల్లగొండలో సమావేశం నిర్వహించారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి



పట్టభద్రుల ఎమ్మెల్సీగా రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థి కపిలవాయి దిలీప్‌కుమార్, ఆ తర్వాత పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఇప్పటి వరకు జరిగిన పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తూ వచ్చింది. 2021లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్నపై విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలుపొందలేదు. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్ఎస్ ప్రణాళిక చేపడుతోంది. వరంగల్‌కు చెందిన ఏనుగు రాకేష్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. గతంలో ఆయన బీజేపీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది.

విజయం సాధించేలా వ్యూహాలు

తీన్మార్ మల్లన్న 2021లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కొద్దిపాటి తేడాతో ఓడిపోయారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనకు పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. దీంతో తమ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఈ ఎన్నికల్లో గెలిపించుకొని పట్టు సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మూడు జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే అత్యధికంగా ఉన్నారు. ఇక బీజేపీ కూడా పట్టభద్రుల స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతోంది. యువతలో బీజేపీపై ఆకర్షణ ఉన్నందున మోదీ చరిష్మాతో పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ తమ సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునే వ్యూహంతో ముందుకు సాగుతోంది.

మల్లన్నను లక్ష మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు తదితరులు

- ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఒక్క అవకాశం ఇవ్వండి మార్పు తీసుకొస్తా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నల్లగొండ: వరంగల్–నల్లగొండ– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ నవీన్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తీన్మార్ మల్లన్న నామినేషన్ కార్యక్రమం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ పార్టీ ప్రజాప్రతినిధుల ఆగడాలపై మల్లన్న అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రజలను పట్టించుకోకుండా అంతా అవినీతి పాలన సాగించిందన్నారు. కాంగ్రెస్.. ప్రజల పక్షపాతి అని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఐదు పూర్తయ్యాయని.. మిగతాది కూడా అమలు చేస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క స్థానం కూడా గెలవదన్నారు. తీన్మార్ మల్లన్న తనకున్న ఆస్తిని ప్రభుత్వానికి రాసిచ్చి ఎమ్మెల్సీగా పోటీ చేయడం గొప్ప విషయమన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తనకు ఒక్క అవకాశం ఇస్తే రాజకీయాల్లో మార్పు తెస్తానన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను ఓడిపోయినా ప్రజల్లో ఉన్నానని, పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటేసి తనను గెలిపించాలని కోరారు. అంతకు ముందు నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నకిరేకల్, ఆలేరు, మిర్యాలగూడ, సాగర్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన



నిడమనూరు: మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

దేవరకొండ, నిడమనూరు: ఎన్నికల విధుల్లో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన హెచ్చరించారు. దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడమనూరులో రెండు నియోజకవర్గాల పీఓలు, ఏపీఓలకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం ఆమె వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా రెండుచోట్ల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ఆరు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణలో తప్పులు చేస్తే సస్పెండ్ చేయడమే కాకుండా ఎన్నికల నిబంధనల మేరకు కేసులు నమోదు అవుతాయన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఆ తర్వాత దేవరకొండ పట్టణంలోని పాత సత్యసాయి కాలేజ్ రోడ్డులో 91 ఏళ్ల నిండిన సీనియర్ సిటిజన్ బీఎస్ శామ్యూల్ హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోగా వారి ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా హోమ్ ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. రెండుచోట్ల ఆమె వెంట అనదపు కలెక్టర్ శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్ ఉన్నారు.

ఏడు కేంద్రాల్లో నీట్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏడు కేంద్రాల్లో ఈ నెల 5న (ఆదివారం) నీట్–2024 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు నీట్ జిల్లా కోఆర్డినేటర్ జి.పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరీక్షకు మొత్తం 2,316 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని, అనుమతించరని పేర్కొన్నారు. పరీక్షకు వచ్చేవారు హాల్ టికెట్‌తో పాస్‌ఫొటో, 4/6 ఫొటోను, ఐడీ కార్డును తీసుకొని రావాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు.

అప్పుడే నకిలీ విత్తనాల దందా!

- ఏపీతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పత్తి విత్తనాలు దిగుమతి
- రహస్య ప్రాంతాల్లో నిల్వచేసిన వ్యాపారులు
- ఏజెంట్ల ద్వారా గ్రామాలకు చేరవేసి రైతులకు విక్రయం
- నామమాత్రంగా అధికారుల నిఘా



నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో అప్పుడే నకిలీ పత్తి విత్తనాల దందా ప్రారంభమైంది. జిల్లాలో వచ్చే వానాకాలం సీజన్‌లో 5.40లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయనున్నట్లు, ఇందుకు సుమారు 15లక్షల వరకు పత్తి ప్యాకెట్లు అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీజన్ ఆరంభానికి నెలరోజుల ముందునుంచే నకిలీ విత్తనాల దందాకు వ్యాపారులు తెరలేపారు. తక్కువ ధరలకు విత్తనాలు ఇస్తామంటూ అమాయక రైతులకు నాసిరకం పత్తి విత్తనాలను అంటగడుతున్నారనే సమాచారం.

పల్లెల్లో ఏజెంట్లను నియమించుకొని..

గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని దందాను మూడుపువ్వులు ఆరుగాయలుగా కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. గత వానాకాలంలో సైతం నాసిరకం పత్తి విత్తనాలను రైతులకు అంటగట్టడంతో సరైన పూత,కాయ రాక దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఇప్పటికే జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, నార్కట్‌పల్లి, చండూరు, మునుగోడు, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, అంగడిపేట, చింతపల్లి, మాల్ వంటి ప్రాంతాల్లో నకిలీలు విత్తనాలు తీసుకొచ్చి గోదాముల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం సమీపంలోని కొన్ని దుకాణాలు, ప్రకాశం బజార్, దేవరకొండ రోడ్డులోని ఒక ఎరువుల దుకాణం, మండలాల్లోని వివిధ గ్రామాల్లో గల దుకాణాల్లోనూ ఈ దందాను జోరుగా సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే వ్యాపారులు మాత్రం తమ వద్ద ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేసే రైతులకు విత్తనాలను ముందస్తుగా ఉద్దెరకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



“ నకిలీ పత్తి విత్తనాలను అమ్మకుండా దుకాణాలు, వ్యాపారులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. గతంలో నకిలీ విత్తనాలు అమ్మి పట్టుబడిన వారు తిరిగి రెండోసారి పట్టుబడితే పీడీ యాక్టు ప్రయోగిస్తాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలను నిర్వహిస్తాం. నకిలీ విత్తనాల అమ్మేవారి సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

ఎన్నికల కోడ్‌కు ముందే విత్తనాల రాక

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండి చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహిస్తున్నారు. కానీ, ఎన్నికల కోడ్ వెలువడక ముందే.. అంటే చెక్‌పోస్టులను ఏర్పాటు చేయకముందే నకిలీ విత్తనాలను జిల్లాకు చేరినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు సుమారు 5లక్షల వరకు విత్తన ప్యాకెట్లు, 8టన్నులట వరకు లూజ్ విత్తనాలను వ్యాపారులు తెచ్చినట్లు సమాచారం.

విత్తనాలు వచ్చింది ఈ జిల్లాల నుంచే..

ముఖ్యంగా మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, ఏపీ రాష్ట్రంలోని కర్నూల్, గుంటూరు, మాచర్ల ప్రాంతాల నుంచి ఈ నకిలీ విత్తనాలు పెద్ద ఎత్తున వ్యాపారులు తెస్తున్నారు. ప్రస్తుతం చెక్‌పోస్టులు ఉన్న కారణంగా కార్లు, బైక్‌లపై ప్రధాన రహదారుల నుంచి కాకుండా గ్రామాల గుండా జిల్లాకు తీసుకొస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నందున గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలను తెచ్చి రైతులకు అంటగడుతున్నారు. గ్రామాల్లోని ఏజెంట్ల ద్వారా విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి నకిలీ విత్తనాల దందాను అరికట్టాలని, లేకుంటే తాము తీవ్ర నష్టాలపాలయ్యే అవకాశం ఉందని కొందరు రైతులు అంటున్నారు.

కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కాలి

- హామీలు అమలు చేయకుండా ఓట్లడుగుతారా..
- రేవంత్‌రెడ్డికి డబ్బా కొడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థులు కృష్ణారెడ్డి, మల్లేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- నల్లగొండ, చండూరులో మాజీ మంత్రి హరీష్‌రావు రోడ్ షో



నల్లగొండలో నిర్వహించిన రోడ్ షోలో విజయ సంకేతం చూపుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు, చిత్రంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: ‘రైతులకు రుణ మాఫీ చేయలేదు.. మహిళలకు రూ.2,500 ఇవ్వలేదు.. రైతుబంధు రూ.15 వేలు ఇవ్వలేదు.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇవ్వలేదు. యువతులకు స్కూటీలు ఇవ్వలేదు.. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కాలని’ అని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలేజీ నుంచి పెద్దగడియారం సెంటర్ వరకు రోడ్డు షో నిర్వహించారు. అంతకుముందు బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ చండూరులో రోడ్డు షో నిర్వహించి మాట్లాడారు. రాత్రి నల్లగొండకు చేరుకున్న హరీష్‌రావు స్థానిక గడియారం సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించే నాయకుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లలో బీజేపీ, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ఏం చేశారని ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. కరెంట్, నీరు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టినందుకు కాంగ్రెస్‌కు ఓటేయాలా అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుక అయిన బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయించే బాధ్యత తీసుకుంటామన్నారు.

నాలుగు నెలల్లో ఏం మార్పు చేశారో చెప్పాలి

మార్పు మార్పు అన్న కాంగ్రెసోళ్లు నాలుగు నెలల్లో ఏమి మార్పు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. వంద రోజుల్లోనే ప్రజలు వద్దో నాయన కాంగ్రెస్ పాలన అని గొంతెత్తి చాటుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తే తిట్లు.. లేకుంటే ఒట్లు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు రాయిస్తే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు కానీ, కోమటిరెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ ఇళ్లలో ఇద్దరు చొప్పున పదవులు పొందారన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారని కానీ, నాలుగు నెలలకు రూ.10 వేలు బాకీ పడ్డారని, అవి ఇచ్చిన తర్వాతనే ఓట్లు అడగాలన్నారు. వడ్లకు 500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అవ్వాతాతల పింఛన్ రూ.4 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, దీనిగురించి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎంను ప్రశ్నించకుండా ఆయనకు డబ్బా కొడుతున్నాడని ఆరోపించారు.



చండూరు రోడ్ షోలో మాట్లాడుతున్న హరీష్‌రావు, చిత్రంలో జగదీష్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

కేసులతో భయపెడుతున్నారు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కేసులతో భయపెట్టి బీఆర్ఎస్ నాయకులను వాళ్ల పార్టీలో చేర్చుకుంటున్నా.. ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన మోసం ప్రజలందరికీ అర్థమైందని బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: కంచర్ల కృష్ణారెడ్డి

ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, లింగయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, నిరంజన్ వలీ, బోనగిరి దేవేందర్, జమాల్ ఖాద్రి, ఆవుల రాములు, కంచనపల్లి రవీందర్‌రావు, మాలె శరణ్యారెడ్డి పాల్గొన్నారు. అలాగే చండూరులో ముఖ్య నేతలతోపాటు జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, గీత కార్మిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, ఎంపీపీ అవ్వారు గీతాశ్రీనివాస్, పాల్వాయి స్రవంతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పరిశీలన



బ్యాలెట్ పేపర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ: నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పేపర్, సంబంధిత రిజిస్టర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన శుక్రవారం పరిశీలించారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ సామగ్రిని ఆర్డీఓ కార్యాలయం నుంచే పంపించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట నల్లగొండ ఆర్డీఓ రవి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదటి రోజు 289 ఓట్లు

- లోక్‌సభ ఎన్నికల్లో మొదలైన హోం ఓటింగ్ ప్రక్రియ
- ఇబ్రహీంపట్నం, మునుగోడు నియోజకవర్గాల్లో పూర్తి

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికలకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు శుక్రవారం ప్రారంభించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా తొలుత ఇబ్రహీంపట్నం, మునుగోడు అసెంబ్లీ సెగ్మెంట్లలో హోం ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. ఈ రెండు చోట్ల మొత్తం 289 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. అంతా మొదటి రోజే ఓటు హక్కు వినియోగించుకున్నారు. శనివారం నుంచి భువనగిరి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ ప్రారంభం కానుంది.

– అర్హులు 10,945.. దరఖాస్తులు 1,364

దివ్యాంగులు, 85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించినా అంతంతమాత్రంగానే స్పందన లభించింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో హోం ఓటింగ్‌కు అర్హత కలిగిన ఓటర్లు 10,945 మంది ఉన్నారు. వీరిలో కేవలం 1,364 మంది మాత్రమే ఫాం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.



ఫాం–12డీ అందజేస్తున్న బీఎల్‌ఓలు

ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంతో..

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలంటే ఆసక్తి చూపడం లేదని ఎన్నికల అధికారులు గుర్తించారు. వీరి సౌకర్యార్థం దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు ఇంటి వద్దనుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం గత అసెంబ్లీ ఎన్నికల నుంచి హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. అయితే క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఓటర్లు స్వల్పంగా ముందుకొచ్చారు.

హోం ఓటింగ్ తేదీలు ఇలా..

నియోజకవర్గం	తేదీ	నమోదైన ఓటర్లు
ఇబ్రహీంపట్నం	3 నుంచి 7	45
మునుగోడు	3 నుంచి 7	244
భువనగిరి	4 నుంచి 7	223
నకిరేకల్	3 నుంచి 8	210
తుంగతుర్తి	4 నుంచి 6	152
ఆలేరు	3 నుంచి 4	258
జనగాం	3 నుంచి 5	232

- మీ కష్టంలో తోడవుతా





ఎన్నికల ప్రచారంలో భాగంగా వలిగొండ మండలం గోకారం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ కొద్దిసేపు పనిచేశారు. – భువనగిరిటౌన్

చెక్కు, డీడీ రూపంలోనే చెల్లించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్



అభ్యర్థుల ఖర్చుల వివరాలు పరిశీలిస్తున్న కళ్యాణ్ కుమార్ దాస్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజు నుంచి ఫలితాలు వెలువడే వరకు చేసే ఎన్నికల ఖర్చును చెక్కు లేదా డీడీ రూపంలో మాత్రమే చెల్లించాలని నల్లగొండ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ తెలిపారు. శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థులు ఎన్నికలు పూర్తయ్యే వరకు కేవలం రూ.10వేల వరకు మాత్రమే నగదు ఖర్చు చేసే అవకాశం ఉందన్నారు. ఆ మొత్తం బ్యాంకు నుంచి డ్రా చేసి ఖర్చు చేయాలన్నారు. మిగతా ఖర్చులు మొత్తం చెక్కు లేదా డీడీ రూపంలో చెల్లించాలన్నారు. ఆయన వెంట సహాయ వ్యయ పరిశీలకుడు సురేష్, అకౌంటింగ్ టీం సభ్యులు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఉన్నారు.

మోదీకి తగిన గుణపాఠం చెప్పాలి

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

వలిగొండ: రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ శుక్రవారం వలిగొండ మండలం గోకారంలో నిర్వహించిన ప్రచారంలో రాఘవులు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుల గణన చేపడితే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని కుల గణన చేపట్టడం లేదన్నారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మణిపూర్‌లోనూ నేరస్తులకు సీట్లు కేటాయించారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి పరిపాలన చేతకాదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చకపోతే మళ్లీ సీపీఎం తరఫున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో చెరుపల్లి సీతారాములు, నారి ఐలయ్య, కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, మద్దెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీవీ రాఘవులు, పక్కన ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



చండూరులో హరీశ్‌రావు రోడ్ షోకు హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



నల్లగొండ పట్టణంలో హరీశ్‌రావు రోడ్ షోలో డ్యాన్స్ చేస్తున్న మహిళలు

కట్టంగూర్ మండలంలో హోం ఓటింగ్ ప్రారంభం



అయిటిపాములలో హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్రరావు

కట్టంగూర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ముందుగా దరఖాస్తు చేసుకున్న 85ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రారంభించారు. కట్టంగూర్ మండల వ్యాప్తంగా 25మంది వృద్ధ ఓటర్లు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా.. శుక్రవారం గార్లబాయిగూడెం, బొల్లేపల్లి, పామనగుండ్ల, పిట్టంపల్లి, అయిటిపాముల గ్రామాలకు చెందిన 11మంది వృద్ధ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ తెలిపారు. అయిటిపాముల గ్రామంలో హోం ఓటింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్రరావు పరిశీలించి మాట్లాడారు. హోం ఓటింగ్ ప్రక్రియలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కుమార్‌రెడ్డి, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

సూర్యాపేట: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు గాను ఎన్నికల సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని శిక్షణ ఇస్తున్న తీరును, పోస్టల్ ఓటింగ్ సెంటర్, డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం రామలింగేశ్వర థియేటర్ వద్ద హోమ్ ఓటింగ్ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. సూర్యాపేట జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అంతకుముందు కొత్త మార్కెట్ యార్డులో గల స్ట్రాంగ్‌రూంను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, కలెక్టర్ వెంకటరావు

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

- కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి



కోదాడలో టీస్టాల్ వద్ద ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

కోదాడ: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఎంతో అవసరమని, ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన కోదాడ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉదయం రంగా థియేటర్ సెంటర్‌లో ఉన్న టీ స్టాల్ వద్దకు వచ్చినవారు వారితో మాట్లాడి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అక్కడి నుంచి కట్టకొమ్ముగూడెం రోడ్డులో మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వారిని కలిసి వారితో కాసేపు నడిచారు. ఆ తర్వాత పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులను కలిసి మాట్లాడారు. కాసేపు వాలీబాల్ ఆడారు. కోదాడలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని వారు తెలిపారు.

చావు డప్పు కొట్టేందుకు వెళ్లి.. తనువుచాలించి..!



వెంకటయ్య (ఫైల్)

శాలిగౌరారం: కులవృత్తిని నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్న ఓ వ్యక్తి వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుండ్లపల్లి వెంకటయ్య(55) తన కుల వృత్తి డప్పు కొడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం తిరుమలరాయునిగూడెంలో ఓ వృద్ధురాలి అంత్యక్రియలకు డప్పుకొట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో వెంకటయ్య ఎండకు తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యాడు. సహచరులు ఆయనను ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అనంతరం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

చెట్టుపై నుంచి జారిపడి మహిళ దుర్మరణం



సుగుణమ్మ (ఫైల్)

బొమ్మలరామారం: చింత చిగురును కోయడానికి చెట్టు ఎక్కిన మహిళ అదుపుతప్పి కిందపడి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని యావపూర్ తండాలో శుక్రవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన పానుగోతు సుగుణమ్మ తన భర్త పాండునాయక్‌తో కలసి వ్యయసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. కొంతభాగంలో వారి పొలంలో కూరగాయలు పండిస్తూ మార్కెట్‌కు తరలిస్తుంది. కూరగాయలతో పాటు చింత చిగురును సైతం మార్కెట్‌కు తీసుకెళ్తుంది. ఈ క్రమంలో శుక్రవారం తమ వ్యవసాయ క్షేత్రం సమీపంలో గల చింతచెట్టు పైకి ఎక్కి చింతచిగురు కోస్తుంది. ఈ క్రమంలో అదుపుతప్పి జారి పడింది. దీంతో తీవ్రగాయాల పాలైన సుగుణమ్మ రోధనలు పరిసర ప్రాంత రైతులు, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఐదుగురు నామినేషన్లు



నామినేషన్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న తీన్మార్ మల్లన్న, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు

నల్లగొండ: నల్లగొండ – వరంగల్– ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి ఒక సెట్, చంద్రశేఖర్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా అలియన్స్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి ఈడ శేషగిరిరావు ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మిట్టపల్లి వెంకటేష్



నియామకపత్రం అందుకుంటున్న మిట్టపల్లి వెంకటేష్

మిర్యాలగూడ: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మిట్టపల్లి వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతులమీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మిట్టపల్లి వెంకటేష్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఆలేరురూరల్ : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని గొలనుకొండ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలకుంట్ల నర్సయ్య ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో డాబాపై నిద్రించారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళాన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడు, 22 తులాల పట్టగొలుసులు, కొంత నగదు అపహరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



నాగేశ్వర్‌రావు మృతదేహం

కట్టంగూర్: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన సోమపొంగు నాగేశ్వర్‌రావు (33) హైదరాబాదు నుంచి స్వగ్రామం వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై కూతురు మనీషతో కలిసి బయలుదేరాడు. మార్గమధ్యంలో కట్టంగూర్ గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగేశ్వర్‌రావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ముగిసిన టెన్నిస్ డబుల్స్ పోటీలు

భువనగిరి : యాదాద్రి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు డబుల్స్ విభాగం శుక్రవారం ముగిశాయి. అండర్–14 బాలుర విభాగంలో ఫజల్ అలీ మీర్, అతర్వ శ్రీరామోజు జట్టు చాంపియన్‌గా నిలిచింది. వీరు వానిజ్ ఆర్యన్ పోత్తునూరి, లక్షయ చుక్కపై 4/6,6/3,10/5 పాయింట్లతో గెలుపొందారు. బాలికల విభాగంలో శ్రీష్టి కిరణ్, పద్మ రమేష్‌కుమార్ టీం 7/6,6/1 పాయింట్లతో షిబాని గుప్తా, శ్రావి డియోరా పై విజయం సాధించారు. విజేతలకు టెన్నిస్ అసోసియేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ, కోచ్ కలీల్, పాఠశాల కరస్పాండెంట్ సుభాష్‌రెడ్డి బహుమతులు అందజేశారు.



షీల్డ్స్, మెమొంటోలతో బాలుర, బాలికల జట్లు

నేడు సింగిల్స్ ఫైనల్

అండర్–14 బాలబాలికల విభాగంలో ఫైనల్ పోటీలు శనివారం జరగనున్నాయి. బాలుర విభాగంలో అతర్వ శ్రీరామోజు(తెలంగాణ), పోత్తునూరి వానిజ్ ఆర్యన్(తెలంగాణ), బాలికల విభాగంలో శ్రీష్టి కిరణ్ (కర్నాటక), షిబాని గుప్తా (మహారాష్ట్ర) జట్లు తలపడనున్నాయి.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు



తాటి చెట్టు పైనుంచి పడిన నాగయ్య

మద్దిరాల : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తంతెనపల్లి నాగయ్య రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వెంటనే గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేసి చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

నందనంలో..

భువనగిరి క్రైం : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నందనం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొడిగె అంజయ్య రోజు మాదిరిగానే శుక్రవారం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన బొడిగె అంజయ్య

పొదుపు సంఘం డబ్బులు స్వాహా



గడ్డిపల్లిలో బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న సభ్యులు

- ఫోర్జరీ సంతకాలతో రూ.10లక్షలు కాజేసిన వీఓఏ
- సహకరించిన బ్యాంకు సిబ్బంది

గరిడేపల్లి : పొదుపు సంఘం సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.10లక్షలు స్వాహా చేశారు. ఈ విషయమై బాధితులు గడ్డిపల్లి ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన సాయిసుధా సమభావన సంఘం సభ్యులు శక్రవారం లోన్ కోసం మండలంలోని గడ్డిపల్లి ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చారు. తమ సంఘానికి లోన్ కావాలని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌ను కోరారు. అందుకు ఆయన గత సంవత్సరమే మీసంఘం పేరు మీద రూ.10లక్షల లోన్ ఉందని, మళ్లీ ఇవ్వడం కుదరదని ఆయన చెప్పడంతో వారు అవాక్కయ్యారు. వెంటనే తేరుకున్న సభ్యులు మేమెప్పుడు లోన్ తీసుకున్నామని బ్యాంక్ సిబ్బందిని నిలదీయడంతో అసలు విషయం బయటికి వచ్చింది. 9నవంబర్ 2023న రూ.10లక్షలు సీసీఎల్ లోన్ కావాలంటూ పత్తేపురం గ్రామానికి చెందిన వీఓఏ, సంఘం సభ్యుల ఫోర్జరీ సంతకాలు, స్టాంపులతో పాటు కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌ల సంతకంతో బ్యాంకులో తీర్మాణం కాపీ ఇచ్చిందని, బ్యాంకు సిబ్బంది కూడా కనీసం విచారించకుండా 1వ, 2వ లీడర్‌లు లేకుండానే డబ్బులు వేరే అకౌంట్‌లోకి బదిలీ చేశారని బాధితులు ఆరోపించారు. అసలు సంఘం సభ్యులు సంఘ లీడర్ లేకుండా డబ్బులను బ్యాంకు సిబ్బంది ఎలా వేరే వ్యక్తుల అకౌంట్లోకి బదిలీ చేస్తారంటూ బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు సిబ్బంది, సంతకాలు ఫోర్జరీ చేసిన వీఓఏపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

> ఫోర్జరీ సంతకాలతో పొదుపు సంఘం డబ్బులు విత్‌డ్రా చేసిన వీఓఏ, అతడికి సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇప్పుడు సమావేశం ఏర్పాటు చేయలేకపోతున్నాం, ఎన్నికల కోడ్ ముగియగానే గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపడతాం.
>
> – నాగేందర్, ఏపీఎం, నేరేడుచర్ల